



# రక్తపు మరకలు



**గోపీచంద్**

కోడి కుయ్యగానే వెంకటయ్యకు మెలకువ వచ్చింది. దొడ్లో ఆవు మెడకు కట్టిన మువ్వలు వినపట్టంలేదు. వెంకటయ్య ఉలిక్కిపడి లేచాడు—కుక్కిమంచంలోనుంచి, మంచానికి ఆనించి పెట్టుకున్న కర్ర చేత్తో తీసుకొని, కిర్రుచెప్పుల్లోకి కాలుదూర్చి, గొడ్ల చావిడిలోకి నడిచాడు. గొడ్లచావిడి ఇంకా చీకటిగానే వుంది. ఆవుమెడకు కట్టిన మువ్వలు వినపడటంలేదు. భయంకరమైన నిశ్శబ్దం. చీకటిని చీల్చుకొని చూశాడు. కట్టుగొయ్యదగ్గర ఆవులేదు. అతని గుండె గుభేలుమన్నది. పలుపు తెంపుకొని ఎక్కడికో వెళ్ళింది ఆవు. ఎక్కడికి వెళ్ళివుంటుంది?

మొదట్లో విడిచిపెట్టినా చావిడి విడిచేదికాదు ఆవు. రాత్రిళ్ళు తిరగటం తానే నేర్పాడు ఆవుకి. తనకు ఆ ఆవంటే ఎంతో ప్రాణం. అది బలిసి నిగనిగలాడుతూ వుండాలని అతని అపేక్ష. కాని దాన్ని తా నెంతని మేప గలడు। అందుకని రాత్రిళ్ళు తానే విడిచి పెట్టే వాడు–దొంగతిండి తిని రమ్మని. మొదట్లో యజమాని అభిప్రాయం ఆ

ఆవు గ్రహించలేకపోయింది. మెడ నుంచి పలుపు ఊడదీసినా కదలకుండా అలాగే నిలబడేది. చావిడిలోనుంచి బయటకుతోలి తలుపువేస్తే, "అంబా, అంబా" అని అరుస్తూ తలుపుదగ్గరే నిలబడి వుండేది. నెమ్మది నెమ్మదిగా తానే అలవాటుచేశాడు — పక్కనున్న పొలాల్లో మెయ్యటం. ఆవు దొంగమేత రుచి మరిగింది. పలుపు విప్పగానే తోక పైకెత్తి బయటకు పరుగెత్తేది. రాత్రులంతా ఎక్కడెక్కడో మేసి, తెల్లవారకముందే నంగనాచికిమల్లే వచ్చి కట్టుగొయ్యదగ్గర నిలబడేది. తాను లేచి బురద తుడిచి కట్టివేశేవాడు.

తెల్లవారి ఎవ్వరైనా ఈ రాత్రి ఏ దొంగగొడ్డో నా చేలోపడి మేసిపోయిందని దుమ్మెత్తిపోస్తుంటే "ఊరుకో, జరిగిందానికి ఏం చేస్తాం? ఇంతకీ రోజులు మారిపోయినై. ఎవ్వరినని అంటాం?" అనేవాడు. ఇలా పట్టుబడకుండా జరిగింది కొన్నాళ్ళు. చేసేపనినిబట్టి ఆ ఆవు కూడా అనేక పోకిళ్ళు నేర్చుకుంది.

రోజులు గడిచిపోతున్నాయి. ఒకనాడు వీరయ్య అనే రైతు కాపేసి రాత్రి దొంగమేతకు వచ్చిన ఆవును పట్టుకున్నాడు. వెంకటయ్య ఇంటికి తోలుకువచ్చి, వెంకటయ్యనూ అతని భార్యనూ లేపాడు. నోటికివచ్చిన తిట్లన్నీ తిట్టాడు. ఏమీ అనలేక వెంకటయ్య "నేను గట్టిగా కట్టేశానయ్యా. అదే తెంపుకుపోయింది" అన్నాడు.

"అదే తెంపుకుపోయిందీ! సరే ఈసారి చేలో పడనియ్. కాళ్ళు విరగగొట్టి మాదిగింటికి తోలుతాను—దాని తాత ఎవ్వడు అడ్డంవస్తాడో" అన్నాడు వీరయ్య.

అనాటినుంచీ ఆవుని కట్టివేసేవాడు వెంకటయ్య. రాత్రిళ్ళ దొంగమేతకు విడిచిపెట్టేవాడు కాదు. కాని అలవాటుపడ్డ ప్రాణం అదెక్కడ వూరుకుంటుంది! అప్పుడప్పుడూ తెంపుకుపోతూ వుండేది. తెల్లవారేపాటికి కట్టుగొయ్యదగ్గరకు వచ్చి నిలబడివుండేది.

మరి ఇప్పుడేమైనట్లు? తెల్లవారవచ్చినా పశువు తిరిగిరాలేదు. వెంకయ్యకు అనుమానం కలిగింది. ఇంట్లోకి వెళ్ళి భార్యను లేపాడు. జరిగింది చెప్పాడు.

"ఊఁ నా మాట మొదటే వింటే"— అన్నది ఆవిడ.

"ఏమాటే?" అన్నాడు వెంకటయ్య.

"ఆ మాటే. రాత్రిళ్ల దాన్ని విడిచిపెట్టొద్దంటే నా మాట విన్నావ్? దానికి నువ్వే దొంగమేత నేర్పితివి. నేర్చుకుంది. ఇప్పుడు మానుకోమంటే మానుకుంటుందా! అనుభవించు" అని మళ్లీ పడుకుంది.





వెంకటయ్యకు ఏమీ తోచలేదు. కళ్ళల్లో వొత్తులుపెట్టుకొని తెల్లవారేదాకా కూర్చున్నాడు. తెల్లవారగానే ఆవును వెతుక్కుంటూ బయలుదేరాడు. ఎక్కడుంది? ఊరు వెతికాడు, చేలు వెతికాడు. ఆవు జాడలేదు. తిరిగి వొస్తుంటే పెదసుబ్బయ్యగారి చినవెంకయ్య కనిపించాడు.

"ఏమే, ఎక్కడనుంచి?" అన్నాడు చినవెంకయ్య.

"గొడ్డు కనపడలేదురా అబ్బాయి" అన్నాడు.

"ఆవేనంటే?"

"అవునురా అబ్బాయి."

"నేనిటు వొస్తుంటే మన బుచ్చిగాడు నీ ఇంటిముందు నుంచుని నానా బండబూతులూ కూస్తున్నాడు. రాత్రి వాడి చేనంతా దొంగగొడ్డేదో మేసిపోయిందట. నీ ఆవేనేమో" అన్నాడు చినవెంకయ్య.

ఈ మాటల్తో వెంకటయ్య మనస్సు గతుక్కుమంది. గబగబా ఇంటికి వెళదాం అనుకున్నాడు కాని మొహం చెల్లలేదు. అసలే బుచ్చిగాడి నోరు మంచిదికాదు. తను కంటపడితే ఏమేమి కూస్తాడో! ఎన్ని అనరాని మాటలు అంటాడో! ఊళ్ళోకి వెళ్ళకుండా, ఏదో పనివున్నవాడికిమల్లే చేనుదగ్గరకు వెళ్ళాడు. గట్టుమీద కూర్చున్నాడు. కళ్ళవెంట నీళ్లుతిరిగినై. తన ఆవు స్వభావసిద్ధంగా అతి నీతి గలిగిన గొడ్డు. దాని మనస్సుని తనే మార్చాడు. ఇప్పుడది తన వశం తప్పింది. తను గ్రామస్థులకు మొహం చూపేది ఎలా? చూపక చేసేదియేముంది? అన్నపువేళకు యింటికి బయలుదేరాడు. ఇల్లు బావురుమంటూ వుంది.

"ఏమే?"

"ఒచ్చా!" అన్నది భార్య. "దానితో పాటు నువ్వూ పోయావేమో అనుకున్నా."

"ఏమయిందే?" అన్నాడు వెంకటయ్య.

"ఇంకేం అవ్వాలి? ఆ బుచ్చయ్య యింత నోరుచేసుకువచ్చి ఇంటిమీద పడ్డాడు. రాత్రి వాడి చేను ఏదో గొడ్డు మేసిపోయిందట. అది మనదేనట. ఊళ్లో పెద్దమనుష్యులందర్నీ తీసుకువచ్చి పంచాయితీ పెట్టాడు."

"ఏమన్నారే?"

"పదిరూపాయలు కట్టమన్నారు వాడి యెదాన."

"ఇంతకీ గొడ్డెక్కడుందే?"

"ఏమో యెక్కడుందో?"

వెంకటయ్య మాట్లాడకుండా వెళ్ళి పడుకున్నాడు — కుక్కి మంచంలో. తన ఆవు కళ్ళల్లో మెదిలింది.

"ఒసేయ్"–భార్యను పిలిచాడు.

"ఏం?"

"కోడిగుడ్లూ, పెరుగూ అమ్ముతుంటివిగదే. ఆ డబ్బు ఎక్కడ పెట్టావ్?"

"తీసుకువెళ్లి వాడి యెదాన వేసివస్తావా?" అన్నది భార్య.

"మరి గొడ్డును తోలుకొచ్చుకోవాలిగదే."

"ఏమో, ఏం చేస్తావో! నన్ను మాత్రం అడక్కు" అన్నది భార్య.

వెంకటయ్య భార్యకు నయానా భయానా చెప్పి చూశాడు. కాని ఆమె వినలేదు. "ససేమిరా అంటే ససేమిరా" అంది. "ఇస్తావా, ఇవ్వవా?" అన్నాడు వెంకటయ్య వొళ్లుతెలియని కోపంతో.

"ఇవ్వను" అన్నది భార్య.

కోపం పట్టలేకపోయాడు వెంకటయ్య. చెంపమీద పెడేలున ఒక్కటి వేశాడు. తన భార్య డబ్బు ఎక్కడ దాచేదీ అతనికి తెలుసు. ఉట్టిమీద వున్న పిడత తీసి, డబ్బులు తీసుకొని బుచ్చయ్య ఇంటికి వెళ్లాడు. అతను నోరు చేసుకుంటూవుంటే ఈసారికి తప్పు కాయమని ప్రాధేయపడ్డాడు. బొడ్డువిప్పి పది రూపాయలూ సమర్పించుకున్నాడు. ఆవు బందెలదొడ్లో వుందని తెలుసుకున్నాడు. అక్కడ కట్టవలసిన డబ్బు కట్టి, ఆవుని తోలుకొచ్చుకోటానికి లోపలకు వెళ్ళాడు. తన ఆవును చూచి నిలువుగుడ్లువేసి నిలబడ్డాడు. ఆవు ఒంటి నిండా రక్తపు మరకలే. దుర్మార్గుడు బుచ్చయ్య గొడ్డుని చావమోదాగు. అతని కళ్లలో నీళ్లు తిరిగినై. ఆవు పసికట్టినట్టుంది; గిరుక్కున తిరిగింది. యజమానిని చూచింది. "అంబా" అని అరిచింది – ఒక్కసారి. ఆ అరుపు బాకులా దిగబడింది వెంకటయ్య హృదయంలోకి. కండ్ల వెంట బొటబొట కన్నీరు కారుస్తూ "తప్పు నీదికాదు–నాది. నా పాపం నువ్వు మోస్తున్నావు. వచ్చే జన్మకు నీ బిడ్డనై పుట్టి నీ ఋణం తీర్చుకుంటాను" అన్నాడు– ఆవు మేను నవరిస్తూ. ఆవు తెలుసుకున్నట్టే తనూ కన్నీరు కార్చింది.





# స్వప్నం సత్యం

వసంతలక్ష్మి

"మేడమ్!" మృదువైన చేతులు తట్టి లేపేయి. ఉలిక్కిపడి లేచి కూర్చుంది శైలజ.

మౌనంగా మందు అందించింది నర్సు!

చిరాకుగా కోపంగా చూసి, నిరాకరించింది శైలజ! "ప్లీజ్! వేసుకోండి. రౌండ్స్‌కి డాక్టర్‌గారు వచ్చేవేళయింది. మందులవి వేసుకోకండా మీరలా నిద్రపోతే రిమార్క్ నా కొస్తుంది" అంటూ మందులు మింగించింది నర్సు.

నర్సు ముఖంలో ఆప్యాయత, ప్రసన్నత వీటిని మించిన శాసించేధోరణి శైలజ కెంతయినా ఇష్టం.

నల్లటి బోర్డరుఉన్న తెల్లటి కాశ్మీరు సిల్ట్ చీరకట్టి ముత్యాలహారం పొడవుగా వేసుకుని పాకెత్తూ దివినుండి దిగివచ్చిన శైలజలాగానే ఉంది. శ్రీమంతుల ఆడపడచులకుండే దర్పం, సభ్యసంస్కారాలూ అన్నీ ఉన్న శైలజని తొలిసారి చూడగానే తెలియని అభిమానం కలిగింది నర్సుకి.